



నాణ్యమైన విత్తనాలే కొనాలి


తెలకపల్లి, సెప్టెంబరు 27 : రైతులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద ఐఎస్ఐ ముద్రించిన విత్తనాలు, ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అథారిటీ కార్యదర్శి జి.సబిత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తాళ్లపల్లిలో రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి పి.మౌనిక మాట్లాడారు. న్యాయవాదులు అలవెందర్‌గౌడ్, మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రామచందర్, శంకర్, దయానంద్, రమేష్, జగదీశ్, ఎస్ఐ బి.నరేష్, గ్రామ కార్యదర్శి పరిజాన బేగం, కేశవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో జల విద్యుత్ ఉత్పత్తి

- ఎస్ఈ సూరిబాబు

ఆత్మకూరు, సెప్టెంబరు 27: ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యానికి చేరువైందని ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ నుంచి 1.33 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నందున రెండు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి జోరందుకుందని చెప్పారు. ఎగువ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 24 గంటల్లో 3.927 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 201.187 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. దిగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 24 గంటల్లో 4.135 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయగా, ఇప్పటి వరకు 174.750 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు వివరించారు. రెండు కేంద్రాల ద్వారా 330 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించాలని ఆదేశాలు ఉండగా, లక్ష్యానికి చేరువలో ఉన్నామని చెప్పారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరలోనే చేరుకుంటామని తెలిపారు.

ఆక్రమణదారుల్లో.. గుబులు



- ఎఫ్‌టీఎల్‌లో ఉన్నవారికి నోటీసులు ఇస్తున్నారని వదంతులు
- ఇరిగేషన్ అధికారుల గత సర్వే జాబితా వైరల్
- పాలమూరులో దాదాపు ఏడు చెరువుల్లో భారీగా ఆక్రమణల గుర్తింపు
- పాత జాబితాలోనే దాదాపు 182 అక్రమ నిర్మాణాలు
- ఎవరికీ నోటీసులు ఇవ్వలేదన్న అధికారులు

మహబూబ్‌నగర్ పట్టణంలోని పెద్ద చెరువు



పెద్ద చెరువు అంచున వెలిసిన నిర్మాణాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లో చెరువులు, నాలాలను కబ్జా చేయడంతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలను హైడ్రా తొలగిస్తున్న విషయం తెలిసిందే. హైడ్రా పరిధిని విస్తరించి, జిల్లాల్లో కూడా ఆక్రమణలు తొలగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే పలు జిల్లాల అధికారులు తమ దగ్గర ఉన్న ఆక్రమణల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తున్నారు. అలాంటి ఒక జాబితా మహబూబ్‌నగర్‌లో గురువారం వైరల్ కావడంతో ఆరా తీస్తున్నారు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలో చెరువులు, కుంటలు కలిపి దాదాపు 33 వరకు ఉన్నాయి. వాటన్నింటినీ గూగుల్ మ్యాప్ ఆధారంగా 2012 పత్రాలను పోలుస్తూ, ప్రస్తుత పరిస్థితిని ఆధారంగా చేసుకుని ప్రధానంగా తొమ్మిది చెరువులు, కుంటల ఆక్రమణలను అధికారులు గుర్తించారు. ఇవి కాకుండా మిగతా వాటిలో కొన్ని ప్రైవేటు కుంటలు కూడా ఉన్నాయి. ఈ జాబితా ప్రకారం అందరికీ నోటీసులు వస్తున్నాయని జోరుగా చర్చ జరుగుతుండగా.. అధికారులు మాత్రం కొట్టిపారేస్తున్నారు. ఇప్పటివరకు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని అంటున్నారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వానికి చెరువుల ఆక్రమణల జాబితా పంపిస్తామని, ఆ వివరాలు వైరల్ కావడంతో ఆందోళన చెందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేవరకు ఎలాంటి నోటీసులూ ఇవ్వబోమని స్పష్టం చేస్తున్నారు. అయితే జాబితా ఒకరి నుంచి ఒకరికి ఫార్వర్డ్ కావడంతో ఆందోళన మాత్రం తీవ్రంగా ఉంది. ఇందులో చాలా మంది పేదలు ఉండగా.. కొంతమంది రియల్టర్లు, బహుళ అంతస్థుల భవనాలు నిర్మించుకున్న వారు కూడా ఉన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జాబితా కంటే ఇంకా అధికంగా అక్రమ నిర్మాణాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో సర్వే నిర్వహించిన అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను కూడా ఏర్పాటు చేశారు. తాజాగా సర్వే చేస్తే మరిన్ని ఆక్రమణలు తేలే అవకాశం ఉంది.

పెద్ద 'చెర'వులు..

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో 33 చెరువులు, కుంటలు ఉండగా.. అందులో తొమ్మిది చెరువుల్లో ఆక్రమణల జాబితాను అధికారులు గతంలో కూడా పంపించారు. మిగతా చెరువుల్లో లే అవుట్లు, ప్రహరీ గోడలు ఉన్నవి గుర్తించారు. అందులో కూడా మూడు చెరువుల్లో ప్రధానంగా ఆక్రమణలు అధికంగా ఉన్నట్లు గత జాబితా చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. మహబూబ్‌నగర్ నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు మొత్తం 96 ఎకరాలు ఉండగా.. అందులో 30 ఎకరాల వరకు ఆక్రమణకు గురై

నట్లు ప్రచారంలో ఉంది. అందులో దాదాపు 12 ఎకరాల్లో నిర్మాణాలు ఉన్నాయని.. వాటి మధ్యలో ఖాళీలు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వైరల్ అవుతున్న జాబితా ప్రకారం దాదాపు 64 నిర్మాణాలు పెద్ద చెరువులో ఉన్నాయి. ప్రస్తుతం సర్వే చేస్తే దాదాపు 150 నిర్మాణాలు తేలే అవకాశం ఉంటుంది. ఇక మరో ప్రధానమైన చెరువు.. పాలకొండ పెద్ద చెరువులో కూడా ప్రధానంగా ఎక్కువ ఆక్రమణలు ఉన్నాయి. ఈ చెరువు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. ఇక్కడ దాదాపు 56 నిర్మాణాలను గతంలో గుర్తించారు. తాజాగా సర్వే చేస్తే అంతకంటే ఎక్కువ ఆక్రమణలు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరో ప్రధానమైన చెరువు ఎర్రకుంటలో దాదాపు 32 ఆక్రమణలు ఉన్నాయి. బండమీదిపల్లి ఇమామ్‌సాబ్ కుంటలో గత జాబితా ప్రకారం 15, పాలకొండ ఊటకుంటలో దాదాపు 12 ఆక్రమణలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటి వల్ల బీకేరెడ్డి కాలనీ, మైత్రీనగర్, రామయ్యబౌలి వంటివి వర్షాలకు కురిసినప్పుడు వరదల్లో మునిగిపోతున్నాయి. శ్రీనివాస కాలనీ ముంపునకు గురవుతుండటంతో పెద్దచెరువు తూము తెంపాలనే డిమాండ్ కూడా వస్తోంది. ప్రస్తుతం ఎవరికీ నోటీసులు ఇవ్వకపోయినప్పటికీ.. త్వరలో మరోసారి ఆక్రమణలను గుర్తించే అవకాశం ఉంది.

జిల్లాల్లో త్వరలోనే కూల్చివేతలు..

హైడ్రా తరహా విభాగాలను జిల్లాల్లో ఏర్పాటు చేసి.. పెరుగుతున్న పట్టణ జనాభాకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. హైడ్రాకు ఇప్పటికే చట్టబద్ధత కల్పించే ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే జిల్లాల్లో విభాగాలు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, మునిసిపాలిటీల అధికారులు తమ పరిధిలోని చెరువులు, ఆక్రమణల వివరాలు సేకరిస్తున్నారు. వాటి పరిధిలో కొత్తగా అనుమతులు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. తాజాగా వైరల్ అవుతున్న జాబితాలో అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్ హాళ్లు, కళాశాలలు, రైస్ మిల్లులు కూడా ఉండటం గమనార్హం. నోటీసులు ఇచ్చిన తర్వాత మొదటి దశలో ప్రైవేటుని టేకప్ చేసే అవకాశం ఉంది.

ఆ ప్రచారం నిజం కాదు

పాలమూరులోని అన్ని చెరువులు, కుంటలకు సంబంధించి ప్రతీ ఆరు నెలలకోసారి అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు ఇస్తుంటాం. అందులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఆక్రమణల వివరాలు కూడా సేకరించి ఇస్తాము. ఏ చెరువు కింద ఎన్ని ఆక్రమణలు జరిగాయో ఆ వివరాలు అధికారులకు ఇచ్చాము. ఇప్పటికే చెరువుల ఎఫ్‌టీఎల్‌లో దిమ్మెలు కట్టి, హద్దులు నిర్ణయించడం జరిగింది. పైస్థాయిలో తీసుకునే నిర్ణయాల మేరకు చర్యలు ఉంటాయే తప్ప, మేము ఇప్పటివరకు ఎవరికీ నోటీసులు జారీ చేయలేదు. నోటీసులు జారీ చేశామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. పెద్ద చెరువు అలుగుల కింద కాలువలు ఆక్రమించిన కొందరికి మాత్రం గతంలో నోటీసులు జారీ చేశాం.

- మనోహర్, ఇరిగేషన్ డీఈ

గణనాథా.. మన్నించు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుల విగ్రహాలు నేడు సోమశిల వద్ద కృష్ణానది తీరాన దయనీయ స్థితిలో ఉన్నాయి. నిర్వాహకులు నిమజ్జనం చేసి వెళ్లగా, నదిలో నీరు తగ్గుతుండటంతో విగ్రహాలు బయటపడుతున్నాయి. విగ్రహాలను ఈ పరిస్థితుల్లో చూసిన భక్తులు, పర్యాటకులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విగ్రహాలను నది లోపలికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

- కొల్లాపూర్



కృష్ణానది తీరాన తేలిన వినాయక విగ్రహాలు

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

గద్వాల, సెప్టెంబరు 27 : కృష్ణానది పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులకు స్వల్పంగా వరద వస్తున్నది. శుక్రవారం ఆల్మట్టి జలాశయానికి 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా అవుట్‌ఫ్లో 60 వేల క్యూసెక్కులు ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 19 గేట్లను ఎత్తి 61,100 క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 1.33 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ఇందులో భీమా ప్రాజెక్టు నుంచి 42 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతున్నది. 15 గేట్లను ఎత్తి 1.05 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 32,475 క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 2 వేల క్యూసెక్కులు, కాలువలకు 10 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అయితే తుంగభద్ర నదీ పరివాహకాలలో కురుస్తున్న వర్షాలకు స్వల్పంగా వరద వచ్చి చేరుతుండటంతో సుంకేసులకు 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా ఒక గేటును ఎత్తి 4,416 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 1.26 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుండగా విద్యుత్ ఉత్పత్తి కోసం 81,600 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు.

విదేశీ మార్కెట్‌లోకి మన మామిడి

- ప్రమాణాలతో ఎగుమతులు
- పైలట్ ప్రాజెక్టుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎంపిక
- రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ నర్సయ్య

వీపనగండ్ల, సెప్టెంబరు 27 : విదేశీ మార్కెట్‌లోకి మన మామిడి ఎగుమతులకు సిద్ధమవుతుందని రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ నర్సయ్య తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో మామిడిలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన పద్ధతులు, మామిడి దిగుబడిలో నెలసరి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ మామిడికి దేశంలో మంచి గుర్తింపు ఉందని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎగుమతులు పెంచుకునేందుకు కేంద్రం సిద్ధమైందని తెలిపారు. అందులో భాగంగానే దేశ వ్యాప్తంగా 53 ఉద్యాన క్లస్టర్లు ఏర్పాటు చేయగా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని చెప్పారు. యాజమాన్య పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేష్ రైతులకు అవగాహన కల్పించారు. ఎగుమతి, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నాగిరెడ్డి తెలిపారు. నాణ్యమైన మాడిని పండిస్తే విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుందన్నారు.

సోమశిలకు జాతీయ అవార్డు

- ఆధ్యాత్మికం, ఆహ్లాదం, వినోదం కేటగిరిలో..
- గ్రామంలోని 7వ శతాబ్దపు లలితాంబికా సోమేశ్వరాలయానికి ప్రత్యేక గుర్తింపు
- ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న జిల్లా అధికారి



జాతీయ అవార్డుతో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ

కొల్లాపూర్, సెప్టెంబరు 27: ఆధ్యాత్మిక, ఆహ్లాదం, వినోదం(స్పిర్చువల్ వెల్‌నెస్) కేటగిరిలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామానికి జాతీయ అవార్డు వచ్చింది. న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో భారత ఉప రాష్ట్రపతి జగదీశ్ ధన్‌ఖర్ నుంచి జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ దానిని స్వీకరించారు. సోమశిల గ్రామంలో ఏడో శతాబ్దానికి చెందిన లలితాంబిక సోమేశ్వరాలయం ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పాత సోమశిల గ్రామంలో నీట మునిగిన ఆలయాన్ని కృష్ణానది తీరాన పునఃప్రతిష్ఠించారు. ఆలయంతో పాటు కృష్ణానది, నల్లమల అందాలు గ్రామాన్ని జాతీయ అవార్డుకు ఎంపికయ్యేలా చేశాయి.



సోమశిలలోని పురాతన సోమేశ్వర ఆలయం

మంత్రి జూపల్లి హర్షం

సోమశిల గ్రామానికి జాతీయ స్థాయి పురస్కారం రావడం పట్ల రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

నల్లమల బయోసైన్స్ ఫోరం కమిటీ ఏర్పాటు

కందనూలు, సెప్టెంబరు 27 : నల్లమల బయోసైన్స్ ఫోరం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం రెండో సర్వసభ్య సమావేశం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించినట్లు నూతన అధ్యక్షుడు పబ్బ శేఖర్‌గౌడ్ తెలిపా రు. ఎన్నికల పరిశీలకులుగా సాయిచందర్‌రెడ్డి వ్యవహరించినట్లు పేర్కొన్నా రు. జిల్లా అధ్యక్షుడిగా పబ్బ శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జగదీశ్వర్‌రెడ్డి, కో శాధికారిగా తిరుపతయ్య, డివిజన్ల నుంచి పలువురు ఉపాధ్యాయులు జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఎంవో షర్ఫుద్దీన్, డీఎస్‌వో రాజశే ఖర్‌రావు, ఈ.వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధం



మన్ననూరులో ఏర్పాటు చేస్తున్న విగ్రహం

మన్ననూర్, సెప్టెంబరు 27 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నాయి. గద్దర్ నల్లమల ప్రాంత సమస్యలపై ఎన్నో పాటలు, ఆటల ద్వారా గళాన్ని విని పించారు. నల్లమలకు ముఖ ద్వారమైన మన్ననూరులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఆయన జ్ఞాపకాలు ఇక్కడి నుంచి హైదరాబాద్, శ్రీశైలం, మద్దిమడుగు వెళ్లే వారు గుర్తు చేసుకుంటారనే ఉద్దేశంతోనే జిల్లాలోనే ప్రథమంగా, రాష్ట్ర స్థాయిలో రెండో విగ్రహాన్ని నెలకొల్పేందుకు గద్దర్ గళం ముందుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబ రు 5న విగ్రహావిష్కరణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులను నాసరయ్య, ఎల్లస్వామి, యశ్వంత్, ఇతర నాయకులు పర్యవేక్షించారు.

చెంచులందరికీ ఆధార్ కార్డులు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి

మన్ననూర్, సెప్టెంబరు 27 : అర్హులైన చెంచులందరికీ ఆధార్ కార్డులు జారీ చేయాలని ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి స్థానిక అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక జన్మన్ ఆధార్ కార్డు నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పెంటల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చెంచులు కార్డులు పొందలేకపోతున్నారు. రెవెన్యూ శాఖ వారే చెంచుల ధ్రువీకరణ కోసం జన న, కులం, స్థానిక ధ్రువీకరణ పత్రాలను ఇక్కడే జారీ చేసేందుకు ఏర్పాట్లు చేశా రు. దరఖాస్తు చేసిన పత్రాలు త్వరగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులను సూచి ంచారు. ధ్రువీకరణ పత్రాలు పొందిన చెంచుల ఆధార్ నమోదుకు వేగంగా పూర్తి చేసి వారి ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ కార్యాలయ ఏవో జాఫర్ పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు27: జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో గబ్జాకు గురైన చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా దళిత పొలిటికల్ జేఏసీ చైర్మన్ వంగూరి జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేసి ప్రభుత్వ చెరువులు, భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం హర్షణీయమని తెలిపారు. ఆదే తరహాలో జిల్లాలో కూడా అమలు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. హైడ్రాను అన్ని వర్గాల ప్రజలు స్వాగతించేందుకు దళిత పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అక్టోబరు 15, 16, 17 తేదీలలో చండీయాగం



ఎస్పీకి ఆహ్వానపత్రం అందిస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 27 : జడ్చర్ల మండలం గంగాపూర్‌లో వచ్చే నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే మలయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవం, శత చండీయాగంలో పాల్గొనాలని ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లును నిర్వాహకులు శుక్రవారం ఆహ్వానించారు. రాచాల జనార్దన్, మలయాళస్వామి ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న మైనార్టీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇందిర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమాచారాన్ని విద్యార్థులకు తెలిజేయాలని కోరారు. తెలంగాణ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మన ఊరు-మనబడి పాఠశాలల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నవాబ్‌పేట, సెప్టెంబరు 27 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదులను శుక్రవారం రాష్ట్రస్థాయి అధికారి షణ్ముఖ చారి పరిశీలించారు. మండల కేంద్రంలో, చౌదూర్, కొల్లూర్, రుద్రారం, కూచూర్‌లో వారు పర్యటించారు. ప్రభుత్వ నిధుల ఖర్చు, అమలు వివరాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పనులు పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో నాగ్యానాయక్, ఏఈ జక్యనాయక్, సీఆర్పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పాలమూరు, సెప్టెంబరు 27 : బీడీ కార్మికులకు పీఎఫ్ డబ్బులు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన పీఎఫ్ అధికారిని కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)ఆధ్వర్యంలో అధికారికి పలు విషయాలను తెలి పారు. ఉమ్మడి జిల్లాలో 20వేల మంది బీడీ కార్మికులు జీవిస్తున్నారని చెప్పారు. రేషన్‌కార్డు ఆధారంగా కార్మికుల పేర్లు పీఎఫ్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఆధార్ కార్డు లింక్ చేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ అధికారాలను ఉపయోగించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అధికారిని కలిసిన వారిలో జె.ఎన్ దేవదానం, పి.అరుణ్‌కుమార్, సాంబశివుడు, చంద్రన్న పాల్గొన్నారు.

ముగిసిన రీజనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్


వాలీబాల్ విజేతగా నిలిచిన అమ్రాబాద్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: క్రీడల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని డీఎఫ్‌వో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు రోజులుగా పలు క్రీడా అంశాల్లో క్రీడాకారులుగా అద్భుత ప్రతిభ చాటారన్నారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. దాదాపు పదేళ్ల తర్వాత అటవీశాఖలో క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన జట్లను రాష్ట్రస్థాయికి పంపిస్తామని చెప్పారు. వాలీబాల్, కబడ్డీలో అమ్రాబాద్ జట్లు గెలుపొందాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 27 : మాలలందరూ ఐకమత్యంతో ఉండి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దళితులను విభజించి పాలించే కుట్రలో భాగమే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందన్నారు. కమిషన్ ఏర్పాటు చేసి కులగణన, సిట్టింగ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. బూర్గుల వెంకటేశ్వర్లు, గోపాస్ రమేష్, మద్దెల దివాకర్, కుంద మల్లికార్జున్, ఆంజనేయులు, స్వామి, శ్రీనివాస్, బాలస్వామి, పాండు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడి చేయడం అమానుషం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, డ్రైవర్లు

గద్వాల క్రైం, సెప్టెంబరు 27: ప్రైవేట్ ఉపాధ్యాయులపై, డ్రైవర్లపై దాడి చేయడం అమానుషమని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వీర అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, డ్రైవర్లు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, డ్రైవర్‌పై ఎలాంటి తప్పు లేకపోయిన దాడికి పాల్పడి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దాడులపై ప్రభుత్వం దృష్టి పెట్టి రక్షణ కల్పించాలని కోరారు. సమాజానికి చదువు, సంస్కారం నేర్పి భావిభారత పౌరులను తయారు చేసే ఉపాధ్యాయుల మీద జరిగే దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులారెడ్డి, యశోద, విజయశ్రీ, ఉమాదేవి, అంజలి, రవి, అయిషా, జిలాని తదితరులు ఉన్నారు.

గుప్తనిధుల కోసం వచ్చారని..

- అడ్డుకున్న బీకే లక్ష్మాపూర్ గ్రామస్థులు
- పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

అమ్రాబాద్, సెప్టెంబరు 27 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపురంలో గురువారం రాత్రి గుప్తనిధుల తవ్వకాల ముఠాను అడ్డుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం గురువారం సాయంత్రం గ్రామ సమీపంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద కారులో కొందరు వచ్చి పరిశీలించినట్లు సమీప వ్యవసాయ భూములు ఉన్న రైతులు తెలిపారు. కొంతమంది రాత్రి 11 గంటల సమయంలో గ్రామంలోని కిరాణా షాపు వద్దకు వెళ్లడంతో వారిని యువకులు ప్రశ్నించారు. తాము వేరే పని మీద ఇక్కడికి వచ్చామని చెప్పినా యువకులు నమ్మలేదు. ఆ తర్వాత వారి మధ్య వాదన జరుగుతుండడంతో మరికొంత మంది కారులో వచ్చి వారిని ఎక్కించుకుని వెళ్లిపోయారు. అదే సమయంలో గ్రామానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. శుక్రవారం లక్ష్మాపురంతండా, లక్ష్మాపురం గ్రామస్తులు అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని గుప్తనిధుల తవ్వకాల కోసం వచ్చారని, ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవీందర్, హరి ఉన్నారని, మరి కొంతమంది వీరి వెనుక ఉన్నారని శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన పై అమ్రాబాద్ ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని, ఆలయం వద్ద ఎలాంటి గుప్తనిధుల తవ్వకాలకు సంబంధించిన ఆనవాళ్లు లేవన్నారు. రవీందర్, హరిని ప్రశ్నించడం జరిగిందని అన్నారు. విచారణలో సమగ్రంగా వివరాలు తెలుస్తాయని ఎస్ఐ వెల్లడించారు.

యాసంగిలో మొక్కజొన్న రకాల సాగుపై అవగాహన


గంగారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల సిబ్బంది

బిజినేపల్లి, సెప్టెంబరు 27: మొక్కజొన్నలో కొత్తగా ఆవిష్కరించిన విత్తన రకాల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించినట్లు దత్తత గ్రామం కన్వీనర్ డాక్టర్ చరణ్ తేజ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగారంలో శుక్రవారం పాలెం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో క్షేత్రదినం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ కళాశాల సిబ్బంది అందజేసిన డీహెచ్-117 మొక్కజొన్న రకాన్ని సాగు చేసిన రైతుల పంట పొలాలను పరిశీలించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రైవేట్ కంపెనీల మొక్కజొన్న రకాల కన్నా తెగుళ్లను తట్టుకొని మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ భానుశ్రీ, ఏఈవో ఫరీద్, రైతులు బంగారయ్య, నరసింహులు ఉన్నారు.

హెచ్‌సీఏ టోర్నీలో విజేతగా నిలవాలి

- ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్
- హెచ్‌సీఏ టోర్నీకి జిల్లా జట్టు పయనం


ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 27: హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శనివారం నుంచి హైదరాబాద్‌లో జరగనున్న హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) అండర్-19 టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు తరలివెళ్లింది. శుక్రవారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. టోర్నీలో జిల్లా జట్టు చక్కటి ప్రతిభ చాటి రాష్ట్రజట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రంజీ జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎదిగేలా కష్టపడి ఆడాలన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రికెట్ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రతినిధి సురేష్‌కుమార్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

అబ్దుల్‌రఫీ, ముఖిదుద్దీన్, మహ్మద్ షాదాబ్ అహ్మద్, అభిలాష్‌గౌడ్, శశాంక్, సాత్విక్‌రెడ్డి, అభినవ్, చరణ్‌తేజ్, అభినవ్‌తేజ్, డి.రాజు, ఎం.అర్జున్‌రెడ్డి, అంకిత్‌రాయ్, వివేక్, నగేశ్.

రాష్ట్రస్థాయిలో క్రీడా ప్రతిభను చాటాలి

- డీవైఎస్‌వో బీఎస్ ఆనంద్

గద్వాల అర్బన్, సెప్టెంబరు 27 : ప్రతి క్రీడాకారుడు అంకిత భావంతో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో 68వ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్-14 బాలుర ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల క్రికెట్ పోటీలకు డీవైఎస్‌ఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో తలపడుతున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులందరూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యే విధంగా ఆడాలన్నారు. 25 మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 3, 4వ తేదీల్లో క్యాంపు నిర్వహిస్తామన్నారు. దీనికి ఎంపికైన క్రీడాకారులు విధిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో క్రికెట్ కన్వీనర్ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్, పీఈటీలు శైలజ, బీసన్న, రజనీకాంత్, తిరుపతి, వీరేష్, రాంబాబు, రవి, కోచ్ శ్రీనివాసులు ఉన్నారు.


గద్వాల బాలికల అండర్-17 విజేత ఫుట్‌బాల్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఫిజికల్ డైరెక్టర్

నడిగడ్డ కీర్తిని చాటాలి

ఫుట్‌బాల్ క్రీడకు పుట్టిని గడ్డగా చెప్పుకునే గద్వాలలో బాలికలు కూడా రాణించి నడిగడ్డ కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటాలని గద్వాల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.జితేందర్ అన్నారు. గద్వాల మండలం వీరాపురంలోని ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి లీగ్ కమ్ నాకౌట్ (వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల, మహబూబ్‌నగర్) అండర్-17 బాలురు, బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జోనల్‌స్థాయిలో ప్రతిభచాటిన వారికి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు హైమావతి, ఆనంద్‌కుమార్, సతీష్, స్వాతి, స్రవంతి, వడ్డెన్న, వెంకటేష్, ఫుట్‌బాల్ కోచ్ విజయ్‌కుమార్ ఉన్నారు.


ప్రాబబుల్స్‌కు ఎంపికైన అండర్-14 క్రికెట్ జట్టు

పీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయండి


నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 27: ఉమ్మడి జిల్లాలో ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం లేక అనేకమంది ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మహబూబ్‌నగర్ పట్టణంలో కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎనుగొండలోని ఓ ఆటో మొబైల్ షోరూంలో పీఎఫ్ ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన నిధి ఆప్కే నికత్ కార్యక్రమంలో పీఎఫ్ నోడల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని కలిసి సమస్యల వినతిపత్రాన్ని కేంద్ర కార్మిక శాఖా మంత్రికి పంపాలని కోరారు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ డీఏతో కలిపి రూ.7,500 పెంచాలని, భార్యాభర్తలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్స్‌ను ముందుగా 2014 సెప్టెంబరు నుంచి రిటైర్డు ఉద్యోగులకు పంపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ అసిస్టెంట్లు వెంకట్‌రావ్, దీపక్ చక్రవర్తి, ఈఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ అరబ్ అనీస్, అసిస్టెంట్ మేనేజర్ అజిత్, బుచ్చన్న, అబ్దుల్‌కరీం, అలితమ్మ, అనంతరెడ్డి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్ కేంద్రం నిర్మించాలి

- జెన్‌కో ఇంజినీర్ల సంఘం కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి


శ్రీశైలం రెండో భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఇంజినీర్లు

దోమలపెంట, సెప్టెంబరు 27: రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని ఈగలపెంట జెన్‌కో ఇంజినీర్ల సంఘం కార్యదర్శి మదన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈగలపెంట జెన్‌కో కార్యాలయం, పాతాలగంగ శ్రీశైలం రెండో భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. కార్యదర్శి మాట్లాడుతూ రామగుండంలోని 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పడగొట్టి, అదే స్థానంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం సింగరేణి, జెన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని నిర్ణయించిందన్నారు. కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని, సింగరేణి భాగస్వామ్యంతో నిర్మాణం చేపడితే ముమ్ముందు సింగరేణి విద్యుత్ కేంద్రాన్ని ప్రైవేటీకరణకు ప్రభుత్వం బాటలు వేసినట్టేనని ఆయన పేర్కొన్నారు. తద్వారా యువతకు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కవని సింగరేణి సంస్థ భాగస్వామ్యాన్ని ప్రభుత్వం విరమించే వరకు ఆందోళన చేపడతామన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబరు 3 వరకు జెన్‌కో విద్యుత్ కేంద్రాలలో గేట్ల ఎదుట సమావేశాలు, 4, 5 తేదీలలో రాష్ట్రంలోని అన్ని జెన్‌కో విద్యుత్ కేంద్రాలు, కార్పొరేట్ కార్యాలయాలు, ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయాలు, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ డివిజన్ కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నిరసన కార్యక్రమాలు చేయాలన్నారు. ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని పిలుపు ఇచ్చామన్నారు. ప్రభుత్వం సందించకపోతే తమ పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీర్లు సందీప్‌రెడ్డి, చరణ్, నరేంద్ర, సునీందర్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన పరిశోధనలు అవసరం

- పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి
- పీయూలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 27 : నైతిక విలువలతో కూడిన పరిశోధనలే మానవాళి మనుగడకు అవసరమని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీయూ లైబ్రరీలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రసంగించారు. యూనివర్సిటీలో అధ్యాపకుల బోధనతో పాటు పరిశోధనలు చేయాలని, యూనివర్సిటీలో పరిశోధనలకు పెద్దపీటం వేస్తున్నామన్నారు. అంతకుముందు చివరి రోజు కీనోట్ స్పీకర్, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.అప్పారావు పరిశోధన ప్రక్రియ, పరిశోధన రూపకల్పన ఎలా చేయాలి? వాటి పద్ధతులు వివరించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కుమారస్వామి, రాజ్ కుమార్, జిమ్మికాటన్, వెంకట రాఘవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబరు 27 : భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం తిర్మలాపూర్ పంచాయతీలోని నర్సంపల్లితండాకు చెందిన సరితను జడ్చర్ల మండలం చౌటగడ్డతండాకు చెందిన ముడావత్ భాస్కర్‌తో 14ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. సంసార విషయంలో భార్యను భర్త తరుచూ వేధిస్తున్నాడని, ఈ నెల 26న ఉదయం ఇంట్లో స్నానం కోసం హీటర్ పెట్టిన వేడినీళ్లను సరితపై పోయడంతో భుజం, వీపు భాగంలో తీవ్రంగా గాయాలైనట్లు సీఐ పేర్కొన్నారు. ఈ విషయం సరిత తల్లి కేతావత్ తారమ్మకు తెలియడంతో కుమారుడు శ్రీధర్‌తో కలిసి వెళ్లి, చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారని సీఐ వివరించారు. తారమ్మ ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వివాహిత అదృశ్యం

గోపాల్‌పేట, సెప్టెంబరు 27 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ హరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని తాడిపత్రి చెందిన మచ్చుమారి నాగేషి, భార్య అంజలి కలసి గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 5న భార్యాభర్తలు గొడవ పడ్డారు. అదే రోజు రాత్రి ఇంట్లో నుంచి భార్య అంజలి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


నవనీత (ఫైల్)

హన్వాడ, సెప్టెంబరు 27 : క్షణికావేశంలో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మాదారంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన నవనీత(26)ను అదే మండలంలోని మాదారం చెందిన మెండె బాలరాజ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. కొన్నేళ్ల నుంచి కడుపునొప్పితో ఈమె బాధపడుతుంది. నొప్పి భరించలేక 26న సాయంత్రం ఇంట్లో ఎవరూ సమయంలో ఉరేసుక్నొట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త బాలరాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బోగం శివకుమార్ (ఫైల్)

హన్వాడ, సెప్టెంబరు 27 : మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడ మండలంలోని వేపూర్ చెందిన బోగం శివకుమార్ (40) పురుగుల మందు తాగి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. 22న తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందాని హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగినట్లు శుక్రవారం భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యాభర్తల గొడవ.. పురుగుల మందు తాగిన భర్త

కృష్ణ, సెప్టెంబరు 27 : భార్యాభర్తలు గొడవపడి పురుగుల మందు తాగిన భర్తను పోలీసులు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఖాన్‌దొడ్డికి చెందిన తారేష్ తన భార్యతో గొడవపడి పురుగుల మందు తాగాడు. అనంతరం అతడే పోలీసులకు ఫోన్‌చేసి తాను పురుగుల ముందు తాగినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు అతను ఉన్న ప్రదేశాన్ని గుర్తించి ముందుగా గ్రామస్థులకు సమాచారం అందించారు. వెంటనే అతడిని మాగనూరు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాయచూర్ తరలించారు.

దుకాణంలో వెండి పట్టీల అపహరణ

- సీసీ పుటేజీల ఆధారంతో నిందితుల గుర్తింపు

అచ్చంపేట టౌన్ , సెప్టెంబరు 27 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వెంకటేశ్వర నగల దుకాణంలో 16న కొందరు మహిళలు నగలు కొనుగోలు చేస్తునట్లుగా నమ్మించి పది జతల కాళ్ల పట్టీలు అపహరించారు. ఈ విషయంపై యజమాని ఆగేపల్లి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాపులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి నలుగురిని గుర్తించారు. తిమ్మాజిపేట మండలం బాజీపూర్ తండాకు చెందిన ముడావత్ బుజ్జి, ముడావత్ లక్ష్మి, ముడావత్ హస్లి, సువర్ణగా గర్తించినట్లు ఎస్ఐ రాము శుక్రవారం తెలిపారు. వెండి విలువ రూ 1.80లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులు వస్తువులతో దేవరకొండకు వెళ్లేందుకు యత్నిస్తుండగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా వారికి సివిల్ జడ్జి విజయ్ కుమార్ 14రోజులు రిమాండ్‌కు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

శేరుపల్లిలో ఐదు రోజులుగా నిలిచిన నీటి సరఫరా


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 27 : వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లిలో ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. వెంకటాపురం, శేరుపల్లి మధ్యన నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో పైపులైన్ పగిలిపోవడంతో సమస్య ఏర్పడింది. పైపులైన్ మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు నీళ్ల లేక ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ సిబ్బంది ట్యాంకులతో గ్రామాల్లోకి నీటిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారి మేఘారెడ్డిని సంప్రదించగా తక్షణమే పైపు మరమ్మతు పనులు చేపట్టి నీళ్లు అందిస్తామన్నారు.

గురుకుల తరగతి గదుల నిర్మాణానికి స్థల పరిశీలన

మన్ననూర్, సెప్టెంబరు 27 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని పీటీజీ గురుకుల పాఠశాల ఆవరణలో గదుల నిర్మాణాన్ని ఐటీడీఏ పీఓ రోహిత్ గోపిడి శుక్రవారం పరిశీలించారు. ఇటీవల వర్షాలకు తరగతి గది పైకప్పు కూలిపోవడంతో, గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ సీతామహాలక్ష్మి పాఠశాలను సందర్శించారు. తక్షణమే శిథిలమైన గదులన్నింటినీ కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త గదులను నిర్మించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శిథిలమైన భవనాలన్నింటినీ కూల్చివేయగా కొత్త నిర్మాణాలు చేపట్టే విషయమై పీవో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కొత్తగా కట్టే గదుల మ్యాపింగ్ చేయించి త్వరలోనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ వెంకటేశ్వర సింఘ్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- 82 మంది అభ్యర్థుల హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 27 : డీఎస్సీ 2008లో అర్హత సాధించినా కోర్టు కేసుల కారణంగా ఉద్యోగాలు పొందని మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో 370 మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డీఈవో కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలన శుక్రవారం నుంచి వచ్చే నెల 5 వరకు అధికారులు చేపట్టారు. మొదటి రోజు శుక్రవారం పరిశీలనకు 82 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో రవీందర్ తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తారాసింగ్



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ తారాసింగ్

బల్మూరు, సెప్టెంబరు 27 : క్షయవ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతవరం గ్రామంలో ఏర్పాటు చేసిన క్షయవ్యాధిగ్రస్తుల శిబిరంలో ఆయన పాల్గొన్నారు. రోగులను పరిశీలించి తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకుని మందులను వాడాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. క్షయ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన చికిత్స ఇవ్వాలని తెలిపారు. డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ విజయలక్ష్మి, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఉమా, నర్సింగ్, ఆఫీసర్, హైమావతి, సీహెచ్ విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు సీతా, లక్ష్మి, యశోద, ఎల్‌టీ రెడ్యానాయక్, హెల్త్ అసిస్టెంట్లు సోమని, శ్రీను పాల్గొన్నారు.

అభయుడి ఆలయ చైర్మన్ పదవి స్థానికులకే ఇవ్వాలి



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రిలే దీక్షలో కూర్చొన్న గ్రామస్థులు

ఊర్కొండ, సెప్టెంబరు 27: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి వారి ఆలయ చైర్మన్ పదవి స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ గ్రామస్థులు మన ఊరు-మన గుడి-మన చైర్మన్ నినాదంతో రిలే దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు చైర్మన్ పదవికి పోటీ పడటం సహజమని, వారికి సర్దిచెప్పి ఒక్కరికే ఇవ్వాల్సిన చోట వేరే గ్రామస్థుడికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ గతంలో పాలించినప్పుడు పక్క గ్రామాలకే ఇచ్చినట్లు, ప్రస్తుతం వేరే గ్రామాలకు ఇవ్వడం చూస్తుంటే గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో ఉండాలా వద్దా అనేది తెలియజేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు ఉందని అన్నారు. చైర్మన్ పదవి గ్రామస్థులకు కేటాయించే వరకు రిలే దీక్షలు చేస్తుంటామని పేర్కొన్నారు. రిలే దీక్షలో మనోహర్‌రెడ్డి, అంజయ్య గౌడ్, మ్యాకల శ్రీనివాసులు, చంద్రయ్య, మన్సూర్, శ్రీశైలం, అశోక్, ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. అదేవిధంగా పలువురు గ్రామస్థులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.

రైతులకు అండగా పీఏసీఎస్

కల్వకుర్తి, సెప్టెంబరు 27: రైతులకు పీఏసీఎస్ అన్నివిధాలుగా అండగా ఉంటుందని కల్వకుర్తి పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల మహాజన సమితి సమావేశం చైర్మన్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో రైతు రుణమాఫీ, దీర్ఘకాలిక రుణాల వసూలు, రైతులకు కొత్త రుణాల మంజూరు గురించి చర్చించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు దీర్ఘకాలిక రుణాలు వెంటనే మంజూరు చేయడానికి అనుమతించాలని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని ఫోన్‌లో కోరినట్లు తెలిపారు. కల్వకుర్తి పీఏసీఎస్ పరిధిలో రైతులకు గోల్డ్‌లోన్ 75పైసల మిత్తికే ప్రారంభించినట్లు ప్రకటించారు. వైస్ చైర్మన్ శ్యామ్, డైరెక్టర్లు పుల్లారెడ్డి, రామునాయక్, బన్నె శ్రీనివాసులు, శ్రీనివాస్‌రావు, కృష్ణగౌడ్, వెంకటయ్య, కరీమాబేగం, కరీమ్, సీఈవో వెంకట్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

ఉప్పునుంతల, సెప్టెంబరు 27: నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మౌనిక శుక్రవారం ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామిని ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదం తీసుకున్నారు. అనంతరం ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. ఆలయానికి సంబంధించి చరిత పుస్తకాన్ని మాజీ ఉప సర్పంచ్ మొగులాల్ అందచేశారు. న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్యామ్‌ప్రసాద్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రర్, నాయకులు ఇంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, ఈవో నరసింహులు, సిబ్బంది కేశవరెడ్డి, రాజు, తదితరులు ఉన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరందించడమే లక్ష్యం

కొల్లాపూర్, సెప్టెంబరు 27 : కొల్లాపూర్ మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరందించడమే కొల్లాపూర్ మునిసిపాలిటీ లక్ష్యమని చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. శుక్రవారం మునిసిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో మిషన్ భగీరథ అధికారు లు, మునిసిపల్ కౌన్సిలర్లతో కలిసి గంగమ్మ గుడి ఆలయ సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్లకు ఆయా ప్రాం తాల్లో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేసి వారం రోజుల్లోపు ప్రతీ ఇంటింటికి సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు. తాగునీటి సరఫరాలో మునిసిపల్ సిబ్బంది, గుత్తేదారులు నిర్లక్ష్యం వహించరాదని ఆమె హెచ్చరించారు. ఆమెతో పాటు మునిసిపల్ కౌన్సిలర్లు శ్రీదేవి, షేక్ రహీంపాష, కర్నె అలివేలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిజ్జ దశరథం, మిషన్ భగీరథ అధికారులు డీఈ శ్రీనివాస్‌రావు, జేఈ షబ్బీర్, మునిసిపల్ ఏఈ హేమలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల నాగరాజు, ఖాదర్‌పాష, కర్నె వాసు, దిలీప్‌శెట్టి పాల్గొన్నారు.

మదారి, మదాసి కురువలను ఎస్సీల్లో చేర్చాలి



మాట్లాడుతున్న మదారి, మదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మే సత్తయ్య

బిజినేపల్లి, సెప్టెంబరు 27 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మదారి, మదాసి కురువలను ఎస్సీల్లో చేర్చి న్యాయం చేయాలని మదాసి, మదారి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మే సత్తయ్య రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా ఎంతో వెనకబాటుకు గురైన కురువలను ఎస్సీ క్యాటగిరిలో చేర్చి కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కురువల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు విడుదల చేసి అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో డీసీసీ ఉపాధ్యక్షుడిగా ఉన్న బంగారి పర్వతాలు కష్టపడి పనిచేస్తూ ఉన్నత స్థాయికి ఎదుగుతుంటే చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న సంబంధిత వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఆ సంఘం వర్కింగ్ రాష్ట్ర అధ్యక్షుడు కురువ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కొల్లూరు వేణుగోపాల్, మదిరే తిక్కన్న, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, కత్తె చిన్న భాస్కర్, లింగమూర్తి, కృష్ణయ్య, క్యామ నరసింహ, చికొండ్ర తిరుపతయ్య, చికొండ్ర రాములు తదితరులు ఉన్నారు.

మందుల్లేవు.. వైద్యమెలా?

- పశువైద్య కేంద్రాల దుస్థితి

- మూగజీవాలకు వైద్యమందక రైతుల వేదన



ఉప్పునుంతలలో మూగజీవాలకు వైద్యం చేస్తున్న అటెండర్

ఉప్పునుంతల, సెప్టెంబరు 27: లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం పశువైద్య కేంద్రాలతో పాటు వైద్య సిబ్బందిని నియమించారు... తప్పా సరైన సమయంలో పశువైద్య కేంద్రాలకు మందులు సరఫరా చేయకుంటే వైద్యులు వైద్యం ఎలా చేస్తారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని వెల్టూరు, తాడూరు గ్రామాల్లో పశువైద్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల పరిధిలో గేదెలు 5629, గొర్రెలు 31257, పశువులు 7007, మేకలు 5137 ఉన్నాయి. వ్యవసాయానికి ప్రతీ రోజు ఉపయోగపడే పశువులతో పాటు గొర్రెలు, మేకలతో పాటు వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు పాడిపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. గత 10 నెలలుగా ప్రభుత్వం పశువైద్య కేంద్రాలకు మందులు సరఫరా చేయకపోవడంతో జీవాలకు వర్షాకాలంలోనే రోగాల బారిన పడి ఎన్నో మృత్యువాత పడుతున్నాయని మండల రైతులు వాపోతున్నారు. రోగాలబారిన పడిన జీవాలను పశువైద్య కేంద్రాలకు తీసుకపోయినా ప్రైవేట్ షాపులకు మందులు రాయడంతో డబ్బులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అదే విధంగా మందులు లేవన్న కారణంతో వైద్య సిబ్బంది పశువైద్య కేంద్రాలకు సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉప్పునుంతల పశు వైద్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ ఇటీవల బదిలీపై రంగారెడ్డి వెళ్లడంతో వెల్టూరులో పనిచేస్తున్న డాక్టర్ దీపిక ఉప్పునుంతల ఇన్‌చార్జి డాక్టర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ లేనప్పుడు ఉప్పునుంతలలో ఆసుపత్రిలో అటెండర్ మీరాజ్ వచ్చీరాని వైద్యంతో మూగజీవాలకు వైద్యం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్య కేంద్రాలకు వైద్య సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చూడాలని, అదే విధంగా కేంద్రాలకు మందులు సరఫరా చేసే విధంగా పాలకులు చొరవ తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

పది రోజుల్లో మందులు వస్తాయి

ఏడు నెలలుగా కేంద్రాలకు మందులు రాలేదు. ఉన్న వాటితో మూగజీవా లకు వైద్యం చేస్తున్నాం, వారం పది రోజులోపు పశువైద్య కేంద్రాలకు మందులు వస్తున్నట్లు ఉన్నతాధికారులు చెపుతున్నారు.

- డాక్టర్ దీపిక, ఉప్పునుంతల

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



ఎస్పీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన గొప్పతనాలను పోలీస్ సిబ్బందికి వివరించారు. నాగర్‌కర్నూల్ ఏడీ డీఎల్ఎస్పీ సీహెచ్.రామేశ్వర్, జిల్లాలో ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చారకొండ పద్మశాలి అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అద్దంకి సునిత నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ శ్రీనివాసులు, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, పద్మశాలి అభివృద్ధి సేవా సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ సత్యం, మండల ప్రధాన కార్యదర్శి శిరందాసు శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి అశోక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్యగౌడ్, నాయకులు శ్రీనివాసులు, అశోక్, రాములు, ఆంజనేయులు, బాలస్వామి, కాశీంఖాన్, ఖలీల్, ముత్యాలుగౌడ్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్: పట్టణంలోని గాయత్రి కళాశాల ఆవరణంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ మాట్లాడారు. గాయత్రి కళాశాల విద్యార్థులు నవీ న్, రాజేష్, కార్తీక్ పాల్గొన్నారు.

● పదర: నేటి యువతకు ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని డిప్యూటీ తహసీల్దార్ భీస్యా అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొండాలక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. సిబ్బంది ఖాసీం, భీమ్ సిం గ్, సత్యనారాయణ, నాగార్జున, శివ పాల్గొన్నారు.

ఆయన ఆశయాలను కొనసాగిద్దాం

కల్వకుర్తి: కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దామని పలువురు నాయకులు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బ్యాంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళుల ర్పించారు. బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు మొగిలి దుర్గాప్రసాద్, సదానందంగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌గౌడ్, వెంకటేశ్, సురేష్, బోడ నరసింహ, భాస్కర్‌గౌడ్, శ్రీను, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు. అలాగే, మునిసిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. చిత్ర పటానికి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ మహమ్మద్ షేక్, కౌన్సిలర్లు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు.

క్రీడలు ఐక్యతను పెంచుతాయి

-ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



క్రీడాకారులకు కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 27: క్రీడల్లో మానసిక ఉల్లాసంతో పాటు ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి క్రీడోత్సవాలు శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ఉన్నత పాఠశాలలతో పాటు గురుకుల, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో బల్మూరు మండలానికి చెందిన ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీహెంఅండ్‌హెచ్‌వో తారాసింగ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు సమూల మార్పులు

అచ్చంపేట: గ్రామాల్లో మంచినీటి సరఫరాలలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు నిరంతం మంచి నీటి సరఫరా జరిగేలా మిషన్ భగీరథలలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలోని రైతువేదికలలో గ్రామ మంచినీటి సరఫరా సహాయకుల 4 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 24 నుంచి 27 వరకు అచ్చంపేట సబ్ డివిజన్ పరిధిలో గ్రామాల మంచినీటి సరఫరా సహాయకులకు చేతి పంపు రిపేర్, పైప్‌లైన్ వేయడంతో పాటు పైపుల మరమ్మతు చేసే విధానం మంచినీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్లీచింగ్ పౌడర్, కలుపడం తదితర అంశాలతో పాటు సింగిల్, త్రీఫేస్ మోటార్లు మరమ్మతు తదితర విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించుకోవాలో అనే అంశాలపై సుదీర్ఘంగా శిక్షణ ఇచ్చినట్లు డీఈ హేమలత తెలిపారు. ఇక నుంచి గ్రామాల్లో మంచి నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రావని వారు పేర్కొన్నారు. ఏఈ బాలరాజుతో పాటు వహిద్, రమేష్, సాయికృష్ణ, శిక్షులు శంకర్, ధర్మ, రవి ఉన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్ రథసారథులు

వంగూరు: కార్యకర్తలే కాంగ్రెస్‌కు రథసారథులని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం వంగూరు గేటు వద్ద ఓ ఫంక్షన్‌లో జరిగిన మండల స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో వంశీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వంగూరు మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్, నాయకులు అల్వాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిపాల్గొన్నారు.

మామిడి రైతుల సమస్యలు తీరుస్తా

- మామిడి రైతుల సహకార సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లేని సుధాకర్‌రావు



కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘం అధ్యక్షుడు పెద్దూరి రామస్వామిని సన్మానిస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, సెప్టెంబరు 27 : కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొల్లాపూర్ మామిడి రైతుల సమస్యలకు త్వరలోనే స్వస్తి పలికి రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు వెల్లడించారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కొల్లాపూర్ మామిడి రైతుల సహకార సంఘాన్ని జిల్లా సహకార సంఘం ఎలక్షన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కే సవ్యసాచి, అధికారి సందీప్‌ల సమక్షంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ మామిడి రైతులంతా సహకార సంఘం గౌరవ అధ్యక్షుడిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లాపూర్ పట్టణ వాసి పెద్దూరి రామస్వామిని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా పెబ్బేటి శివకుమార్, ఎర్ల మోని రామస్వామి, మానవపాడు పెంటమ్మ, పెబ్బేటి స్వప్న, మన్నమోని పుల్లయ్య, సారాయి శేఖర్, ఎల్లేని శేఖర్, బొబ్బిటి విష్ణువర్ధన్‌రెడ్డిలను రైతులు ఎన్నుకున్నా రు. వీరికి జిల్లా సహకార సంఘం ఎలక్షన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కే సవ్యసాచి నియామక పత్రం అందజేశారు. అధ్యక్షుడు పెద్దూరి రామస్వామిని ఎల్లేని శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మామిడి రైతులను సమావేశపర్చి సంఘం సభ్యత్వాలు నిర్వహించడంతో పాటు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి సహకారంతో కొల్లాపూర్ ప్రాంతంలో ఉన్న మామిడి రైతుల సమస్యలకు స్వస్తి పలికేలా భూసార పరీక్ష కేంద్రం అధికారులను సమన్వయపర్చి వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. స్థానికంగా మామిడి కొనుగోలు మార్కెట్ ఏర్పాటు చేసి మామిడి రైతుల కష్టాలు తీరేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన వెల్లడించారు.

పోలీసులకు డ్యూటీ మీట్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఎస్పీ డ్యూటీ మీట్-2024ను శుక్రవారం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీమీట్‌లో భాగంగా పోలీసులకు సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ వరకు ఒక ఫేక్ క్రైమ్ సీన్‌ను ఏర్పాటు చేసి దాని మీద ఎలాంటి అవగాహన ఉందనే దాని మీద ఇన్విస్టిగేషన్ ప్రాసెస్ మీద ఎగ్జామ్ రాయించడం, ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కంప్యూటర్ టెస్టు, క్లూస్‌టీమ్, వివిధ టెస్టులను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు నిర్వహిస్తారు.

పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ఏఆర్ ఏడీఎల్ఎస్పీ టీపీ భరత్ సమక్షంలో డాగ్స్ స్క్వాడ్‌తో కూడా డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ డ్యూటీ మీట్‌లో ఎవరైతే పర్ఫామెన్స్ బాగా చేసి డిస్ట్రిక్ట్ నుంచి జోనల్ లెవల్‌కి జోనల్ లెవల్ నుంచి స్టేట్ లెవల్‌కు, స్టేట్ లెవల్ నుంచి నేషనల్ లెవల్‌కు వెళ్లి ఎవరైతే గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ సాధిస్తారో వాళ్లకి ఇంక్రిమెంట్‌తో పాటు ప్రైజ్‌మనీ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాటల సీడీ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ తీసుకుని యువత బాగా మాదకద్రవ్యాల బారిన పడుతున్నారని వారిని డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శుక్రవారం ఒక పాటల సీడీని విడుదల చేశారు.

మీసాల రాము సింగర్ ఆధ్వర్యంలో తయారు చేసిన పాటను ఆవిష్కరించారు.

మండల విద్యాధికారులుగా బాధ్యతల స్వీకరణ

- జిల్లాలో 16 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం



మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన జీవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేట, సెప్టెంబరు 27: జిల్లాలోని పలు మండలాల్లో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి పోస్టులను ప్రభుత్వం ఆయా మండలాలలో పనిచేస్తున్న జీహెచ్ఎంలను మండల విద్యాశాఖ అధికారులుగా నియమిస్తూ ఈనెల 24న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అచ్చంపేట నియోజకవర్గంలో ఆరు మండలాలకు ఎంఈవోలను నియమించారు. అచ్చంపేట మండల విద్యాశాఖాధికారిగా జీవన్‌కుమార్ నియమితులయ్యారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్ఎంగా పనిచేస్తున్న ఆయనను మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బల్మూరు మండలంలో కొండనాగుల జీహెచ్ఎంగా పనిచేస్తున్న విష్ణుమూర్తిని బల్మూరు మండల విద్యాధికారిగా నియమించారు. ఉప్పునుంతల మండ లం కంసానిపల్లి జీహెచ్ఎంగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను ఉప్పునుంతల మండల విద్యాధికారిగా నియమించారు. అమ్రాబాద్ మండలంలో బాలుర ఉన్నత పాఠశాలలో జీ హెచ్ఎంగా పనిచేస్తున్న బాలకిషన్‌ను మండల విద్యాధికారిగా నియమించారు. లింగాల మండలం కేంద్రంలోని జీహెచ్ఎంగా పనిచేస్తున్న బషీర్ అహ్మద్‌ను మండల విద్యాధికారిగా నియమించారు. పదర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎంగా పనిచేస్తున్న బుచ్చిబాబును పదర మండల విద్యాధికారిగా నియమించారు. అచ్చంపేట మండల విద్యాధికారిగా నియమితులైన జీవన్‌కుమార్‌ను బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

సంక్షిప్తంగా..

చారకొండ మండల విద్యాధికారిగా ఝాన్సీరాణి

చారకొండ: మండల విద్యాధికారిగా ఝాన్సీరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇన్‌చార్జి ఎంఈవోగా శంకర్‌నాయక్ కొనసాగారు. మండలంలోని జూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎంగా పనిచేస్తున్న ఝాన్సీరాణి మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టడంతో మండలంలోని మర్రిపల్లి ఎమ్మార్సీ భవనంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు ఆమెను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

ఎంఈవోగా చెన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు

తెలకపల్లి: మండల విద్యాధికారిగా చెన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గతంలో మండల విద్యాధికారిగా పని చేసిన చంద్రుడు చేతుల మీదుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తెలకపల్లి ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది నూతన ఎంఈవోను, మాజీ ఎంఈవోను సన్మానించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సుజీవన్‌రెడ్డి, నరహరి, ఉపాధ్యాయ సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊర్కొండ మండల విద్యాధికారిగా మురళీధర్ గౌడ్

ఊర్కొండ: మండల విద్యాధికారిగా కర్నాటి మురళీధర్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే బదిలీపై మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు.

శంకర్‌నాయక్ ఇన్‌చార్జి విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ప్రభుత్వం బడులను బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

తిమ్మాజిపేట మండల విద్యాధికారి సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం సత్యనారాయణశెట్టి ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు.

అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రాములునాయక్ తాను ఎంఈవోగా బాధ్యతలకు సంబంధించిన రిపోర్టును ఉపాధ్యాయులు వెంకటేశ్వ ర్లు అమరసింహారెడ్డి తదితరులతో కలిసి అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు

చారకొండ, సెప్టెంబరు 27: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు గుంతల మయంగా మారిన జడ్చర్ల-కోదాడ ప్రధాన రాహదారికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కేసీవీఆర్ కంపెనీ కాంట్రాక్టర్‌తో మాట్లాడి గుంతలమయంగా మారిన రోడ్డుకు శుక్రవారం కంకర, డస్ట్ వేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చారకొండ నుంచి మర్రిపల్లి వరకు నాలుగు లేన్ల రోడ్డుతో పాటు సెంటర్ లైట్, నూతన బ్రిడ్జికోసం రూ. 42 కోట్లు మంజూరు చేయాలని ఇదివరకే ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవి

బల్మూరు, సెప్టెంబరు 27 : ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులు పిరంగి రవి ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కలిసి ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించాలి



బాలసదన్‌లో పండ్లు పంపిణీ చేసిన జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 27: లోక్ అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలసదన్‌ను సందర్శించి అక్కడ చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ చిన్నారికి చక్కటి వైద్యం, విద్య ఇతర రంగాలలో అవకాశాలు వచ్చేలా చూడాలని, అందుకోసం తాను తప్పకుండా వ్యక్తిగతంగా సహాయం అందిస్తానన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుని జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయ్‌కుమార్‌తో కలిసి సందర్శించి న్యాయవాదులతో కలిసి కోర్టులో ఉన్న సమస్యలపై చర్చించారు. నేషనల్ లోక్ అదాలత్‌లో కేసులని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపూర్ రాజేందర్, కార్యదర్శి కౌసర్, సీనియర్ న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, సత్తయ్య, వెంకటశెట్టి, మస్తాన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తను వేర్వేరుగా వేయాలి

కల్వకుర్తిటౌన్, సెప్టెంబరు 27 : తడిచెత్తను పొడిచెత్తను వేరువేరుగా వేయాలని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ మహమూద్‌షేక్ అన్నారు. శుక్రవారం వారు పట్టణంలోని తడిచెత్తను,పొడిచెత్తను వేరుచేసే యార్డును పరిశీలించి మాట్లాడారు. అనంతరం గాంధీనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారిని పరిశీలించి నిర్మాణపనులు నాణ్యతగా పూర్తిచేయాలని సూచించారు. వైస్‌చైర్మన్ షాహెద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ, మహిళసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువులు తయారు చేయాలి

ఊర్కొండ, సెప్టెంబరు 27: మండలంలోని గ్రామాల్లో ఉన్న సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువుల తయారీ వెంటనే చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో నరసింహ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

భగత్‌సింగ్ జయంతి వేడుకలు

కొల్లాపూర్, సెప్టెంబరు 27: భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లకు భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించి స్వతంత్ర ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిల్ల గ్రామంలో బీఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయి, యశ్వంత్ పాల్గొన్నారు.

●పెంట్లవెల్లి: భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల నాయకులు హనుమంతు, తిమ్మస్వామి, రాజు, రమణ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ పరిశుభ్రతపై అవగాహన

కోడేరు, సెప్టెంబరు 27: స్వచ్ఛతా హీ సేవా పరిశుభ్రతపై మండల అభివృద్ధి అధికారి శ్రవణ్‌కుమార్ పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో స్వచ్ఛత పరిశుభ్రత గురించి తెలిపారు.

షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి

పదర, సెప్టెంబరు 27: షరతులు లేకుండా రైతులకు రుణయాఫీ చేయాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు మూడిగ శంకర్ యాదవ్ అన్నారు. ఆయన మండలంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం అవలంబిస్తున్న రుణమాఫీ పథకం రైతులకు అర్థంకాని పరిస్థితుల్లో ఉందని ఆరోపించారు. రూ.2 లక్షల పైగా అప్పుఉన్న రైతులకు ప్రభుత్వం వెంటనే రూ.2లక్షలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మిగతా అప్పుకు సంబంధించిన వడ్డీ తగ్గుతుందని తెలిపారు. అసలే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, ఈ సారి కూడా వ్యవసాయం అంతంతమాత్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శివ, రవి, తిరుపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.